క్లుప్తంగా

హజ్ యాత్రికులకు సన్మానం


యాత్రకు వెళ్తున్న వారిని ఊరేగిస్తున్న దృశ్యం

ఉరవకొండ: పట్టణం నుంచి పవిత్ర హజ్ యాత్రకు వెళుతున్న వారిని బుధవారం ఘనంగా సత్కరించి, పట్టణంలో ఊరేగించారు. స్థానిక జైనబీ్బ దర్గా మసీదు కమిటీ ఆధ్వర్యంలో హజ్ యాత్రికులు కరీం, సారాంబిని సన్మానించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు బేల్దార్ జిలాన్, రషీద్, లెనిన్‌బాబు, శర్మాస్, మహ్మద్ హనీఫ్ పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాల వేలం

గుమ్మఘట్ట: వివిధ మద్యం కేసుల్లో పట్టుబడిన ద్విచక్రవాహనాలను సెబ్ సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో బహిరంగ వేలం వేసినట్లు ఎస్‌ఐ సునీత తెలిపారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ కార్యాలయ ఆవరణంలో 10 ద్విచక్రవాహలను బుధవారం వేలం వేయగా రూ. 83,425 ఆదాయం వచ్చిందన్నారు.

వేలం వాయిదా

రాయదుర్గంటౌన్: మున్సిపల్ కూరగాయల షాపింగ్ కాంప్లెక్స్ పైఅంతస్తులో నిర్మించిన గదుల అద్దెకు గురువారం నిర్వహించాల్సిన వేలం వాయిదా వేసినట్లు కమిషనర్ దివాకర్ రెడ్డి తెలిపారు. గత నెల 27న జరిగిన వేలానికి పాటదారులు హాజరుకాకపోవడంతో జూన్ 8కి వాయిదా వేశామన్నారు. అనివార్య కారణాల వల్ల 8వ తేదీ నిర్వహించాల్సిన వేలం వాయిదా వేస్తున్నట్లు ఆయన తెలిపారు. వేలం ఎప్పుడు నిర్వహిస్తామో త్వరలో ప్రకటిస్తామన్నారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ


సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాసరావు


గుమ్మఘట్ట: మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసులు బుధవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసులను త్వరితగతిన క్లేదించాలని సిబ్బందిని ఆదేశించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో సఖ్యతగా మాట్లాడి సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేయాలని రూరల్ సీఐ యుగంధర్, ఎస్‌ఐ సునీతకు సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే సహించేదేలేదన్నారు. అక్రమ మద్యం, ఇసుక తరలిపోకుండా పటిష్టమైన చర్యలు చేపట్టినట్లు ఆయన మీడియాకు తెలిపారు. అసాంఘిక శక్తులపై ఉక్కు పాదం మోపామన్నారు. చట్టాన్ని అతిక్రమిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించే ప్రసక్తేలేదని తెలిపారు. కార్యక్రమంలో సెబ్ అడిషనల్ ఎస్పీ నాగభూషణం, డీఎస్పీ శ్రీనివాసులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా షాబాజ్ దీవాన్ వలీ ఉరుసు


దర్గాలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్: మండలంలోని కల్‌హోళ గ్రామంలో హజరత్ సయ్యద్ షాబాజ్ దీవాన్ వలీ ఉరుసు ఘనంగా నిర్వహించారు. బుధవారం ఉదయం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. భక్తుల స్వామికి చాదర్‌లు, నూతన వస్త్రాలు, పూలహారాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనేక మంది భక్తులు తమ పిల్లలకు చక్కెర తులాభారం వేయించారు. ఈ సందర్భంగా దర్గా నిర్వాహకులు స్వామి చిహ్నాన్ని గ్రామ వీధులలో తప్పెట వాయిద్యాల , తాషా డ్రమ్ములు, మంగళవాయిద్యాలతో ఘనంగా ఊరేగించారు. ఎస్‌ఐ శివ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

మొలకెత్తని ఆముదం పొలం పరిశీలన


పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

బొమ్మనహాళ్: 'నట్టేట ముంచిన నకిలీ విత్తనాలు' అనే శీర్షిక బుధవారం 'సాక్షి'లో ప్రచురితం కావడంతో వ్యవసాయాధికారి అహమ్మద్‌బాషా, వ్యవసాయ సిబ్బందిలో కలిసి బుధవారం మొలకెత్తని ఆముదం పంటను పరిశీలించారు. వ్యవసాయధికారి మాట్లాడుతూ అనంతపురంలోని శ్రావణి ఎంటర్ ప్రైజెస్ అనే దుకాణంలో రైతు శ్రీరాములు ఆముదం విత్తనాలు కొనుగోలు చేసి 15 ఎకరాల్లో నాటారని, ప్రస్తుతం విత్తనాలు కుళ్లిపోయాయన్నారు. ఆముదం విత్తనాల ప్యాకెట్‌పై ఈ నెలకే గడువు తేదీ ముగిసిందన్నారు. బాధిత రైతుతో ఆముదం విత్తనాలు కొనుగోలు చేసిన రసీదులు, విత్తనాల ప్యాకెట్లను తీసుకున్నామన్నారు. నివేదిక తయారు చేసి జేడీఏకు పంపుతామన్నారు. బాధిత రైతుకు సాయం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు.

పేదరికం లేని రాష్ట్రమే సీఎం లక్ష్యం

- మంచిచేసే ప్రభుత్వానికి మద్దతుగా నిలవండి
- 'గడప గడపకూ మన ప్రభుత్వం'లో ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి


రాయదుర్గం: మల్లికేతిలో సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

డి హీరేహాళ్(రాయదుర్గం): పేదరికం లేని రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రధాన లక్ష్యమని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. డి హీరేహాళ్ మండలంలోని మల్లికేతిలో బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ నాలుగేళ్లలో పొందిన లబ్ధిపై ప్రత్యేకంగా ముద్రించిన బుక్‌లెట్‌ను వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎం.వన్నూర్ స్వామి, సచివాలయాల కన్వీనర్ రాళ్ల తిమ్మారెడ్డితో కలసి ఇంటింటికీ వెళ్లి అందజేశారు. అనంతరం విప్ కాపు మాట్లాడారు.. మీ సంక్షేమం, మీ బిడ్డల భవిష్యత్ కోసం పెద్దపీట వేసే ప్రభుత్వానికి ప్రజలంతా మద్దతుగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. టీడీపీకి ఓటు వేసిన పచ్చ నాయకుల ఇళ్లకు సైతం ఎక్కడా వివక్ష మాటే లేకుండా డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) ద్వారా నేరుగా రూ.2.10 లక్షల కోట్లు వ్యక్తిగత ఖాతాలకు చేర్చిన ఘనత వైఎస్సార్‌సీపీకే దక్కుతుందన్నారు. గత టీడీపీ హయాంలో ఆ పార్టీ నాయకులు దోపిడీకే ప్రాధాన్యమిచ్చారన్నారు. జన్మభూమి కమిటీల పెత్తనం ఏ స్థాయిలో ఉండేదో ప్రజలకు చెప్పనక్కర్లేదన్నారు. టీడీపీ పోలిట్‌బ్యూరో సభ్యుడు కాలవ శ్రీనివాసులు రాయదుర్గానికి వచ్చినప్పటి నుంచి రాజకీయాలు పూర్తిగా భ్రష్టు పట్టాయన్నారు. ప్రశాంతతకు మారుపేరుగా నిలిచిన రాయదుర్గంలో ప్రజల మధ్య విద్వేశాలు రెచ్చగొట్టి పబ్బం గడుపుతున్నాడని మండిపడ్డారు. 2024 రాష్ట్రంలో చంద్రబాబు, రాయదుర్గంలో కాలవకు ఆఖరివి కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ పార్వతి, ఎంపీటీసీ రంగమ్మ, నాయకులు మల్లికార్జున, గోవిందు, ఎర్రిస్వామి, మల్లికార్జునరెడ్డి, సురేష్‌రెడ్డి, జంబన్న, సతీష్, సర్పంచులు బీ మల్లికార్జున, శ్రీనివాస రెడ్డి, నాయకులు తొండె వెంకటేశులు, గన్నిగౌడ, శివ కుమార్, నాగయ్య పాల్గొన్నారు.

మళ్లీ వైఎస్ జగనన్నే ముఖ్యమంత్రి

గుమ్మఘట్ట: భావితరాలకు ఉజ్వల భవిష్యత్తును అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆదరిస్తామని పలువురు లబ్ధిదారులు తెలిపారు. మండలంలోని పూలకుంట వద్ద ఉన్న అయ్యప్పనగర్‌లో బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి హాజరై ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు బుక్‌లెట్ అందించారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎంత లబ్ధి చేకూరింది? వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో ఎంత లబ్ధి చేకూరిందో తేడా గమనించాలని విప్ కోరారు. చంద్రబాబును నమ్మితే జీవితాలు బుగ్గిపాలవడం ఖాయమన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అభివృద్ధి ,సంక్షేమం రెండు కళ్లలా ప్రగతి పరుగులు తీస్తుంటే టీడీపీ నాయకులు జీర్ణించుకోలేక గగ్గోలు పెడుతున్నారని ధ్వజమెత్తారు. రాబోవు ఎన్నికల్లో 175 స్థానాల్లో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేయడం తథ్యమని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ రాధమ్మ, ఎంపీపీ భవాని, జెడ్పీటీసీ సభ్యుడు పీఎస్ మహేష్, తహసీల్దార్ బ్రహ్మయ్య, మండల ప్రత్యేకాధికారి రాంమోహన్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ బోయ మంజునాథ, జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు గౌనికాంతారెడ్డి, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి బీటీపీ గోవిందు, కాంటాక్టర్ కొత్తపల్లి సత్యనారాయణరెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ సుధాకర్ రెడ్డి, వైస్ ఎంపీపీ రామకృష్ణారెడ్డి, సర్పంచులు కోట్ల ఉమేష్, రమేష్, రాజేష్, ఎంపీటీసీ గోవింద, మాజీ కన్వీనర్ అశ్వర్థరెడ్డి, నాయకులు గోనబావి ప్రతాప్ రెడ్డి, హనుమన్న, రామప్ప, కేఎం రాజు తదితరులు పాల్గొన్నారు.

సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన ఏపీఎన్జీఓ నాయకులు

కళ్యాణదుర్గం: 20 ఏళ్లుగా కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్న ఉద్యోగులను రెగ్యులర్ చేసినందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కాంట్రాక్టు పారామెడికల్ ఉద్యోగులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు ఏపీ ఎన్జీఓ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవ, కాంట్రాక్టు పారా మెడికల్ ఉద్యోగుల జిల్లా అధ్యక్షుడు జాన్సన్, సభ్యులు నరసారెడ్డి, వీరశేఖర్, పురుషోత్తం, రాయుడు, గోవిందరాజులు, నారాయణ, ఆర్థర్ బాబు బుధవారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. గత 20 ఏళ్లుగా రెగ్యులర్‌కు నోచుకోక తక్కువ జీతంతో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల బాధలను సీఎం గుర్తించారన్నారు. ఉద్యోగ రీత్యా ఎన్నో అవస్థలతో జీవితాలను నెట్టుకొచ్చారన్నారు. పాదయాత్రలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారని వారు కొనియాడారు. రాబోవు రోజుల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తమ సంపూర్ణ మద్దతు ఇవ్వనున్నట్లు వారు స్పష్టం చేశారు.

సీఎం రిలీఫ్ ఫండ్ అందజేత

కంబదూరు: మండలంలోని రాళ్లపల్లికి చెందిన ఎరిల వారాధమ్మకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.60 వేల చెక్కు మంజూరైంది. ఆ చెక్కును బుధవారం వైస్ ఎంపీపీ బీమేష్, సర్పంచ్ అమర్, మాజీ సర్పంచ్ ఆదెప్ప, ఉప సర్పంచ్ శ్యామంత్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రాజప్ప, రవీంద్రారెడ్డి, తలారి రాజన్న, రవీంద్ర, మాజీ డీలర్ మారెన్న పాల్గొన్నారు.

అర్హులందరికీ వేరుశనగ పంపిణీ


చీకలగురికిలో రైతులకు విత్తనం పంపిణీ చేస్తున్న డీఏఓ ఉమామహేశ్వరమ్మ

విడపనకల్లు: అర్హులైన రైతులందరికీ విత్తన వేరుశనగ పంపిణీ చేస్తామని జిల్లా వ్యవసాయాధికారి (డీఏఓ) ఉమామహేశ్వరమ్మ అన్నారు. మండలంలోని చీకలగురికి ఆర్‌బీకే కేంద్రంలో బుధవారం డీఏఓ చేతుల మీదుగా రైతులకు విత్తన వేరుశనగను వ్యవసాయాధికారులు పంపిణీ చేశారు. అంతక ముందు డీఏఓ చీకలగురికి ఆర్‌బీకేని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం రైతులతో మాట్లాడారు. ఖరీఫ్‌లో మండలవ్యాప్తంగా ఏఏ పంటలను ఎక్కువగా సాగు చేస్తారో తెలుసుకున్నారు. ఆర్‌బీకే పనితీరుపై ఆరా తీశారు. ఆర్‌బీకే సేవలు అమోఘమని రైతులు సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం డీఏఓ విలేకరులతో మాట్లాడారు. ఏటా ఖరీఫ్‌లో జిల్లావ్యాప్తంగా 2.5 లక్షల హెక్టార్లలో వేరుశనగ సాగవుతోందన్నారు. విడపనకల్లు మండలానికి వెయ్యి క్వింటాళ్ల వేరుశనగ కేటాయించమని, ఇప్పటి వరకూ 270 మంది రైతులు ఆర్‌బీకేల్లో రిజిస్ట్రేషన్ చేసుకోగా.. 245 క్వింటాళ్ల విత్తన వేరుశనగ పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో ఏడీఏ పద్మజ, ఎంఏఓ పెన్నయ్య, వీఏఏ లక్ష్మణ్, రైతులు పాల్గొన్నారు.

కూడేరు: ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతు వద్దకే సబ్సిడీతో నాణ్యతతో కూడిన విత్తన వేరుశనగను అందిస్తోందని మండలంలోని కొర్రకోడు సర్పంచ్ చంద్రశేఖర్ యాదవ్ అన్నారు. బుధవారం ఆ గ్రామంలోని ఆర్బీకేలో విత్తన వేరుశనగ పంపిణీని సర్పంచ్ ప్రారంభించారు కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

వజ్రకరూరు: మండల వ్యాప్తంగా 2,400 మంది రైతులకు విత్తన వేరుశనగ పంపిణీ చేసినట్లు ఏఓ మధుకర్ తెలిపారు. బుధవారం మండలంలోని గూళ్యపాళ్యం రైతుభరోసా కేంద్రంలో చేపట్టిన వేరుశనగ పంపిణీ, రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఇప్పటి వరకు 2,400 మంది రైతులకు 2,106 క్వింటాళ్ల వేరుశనగ పంపిణీ చేశామన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి


పడిపోయిన విద్యుత్ స్తంభం చూపుతున్న రైతులు

విడపనకల్లు: విద్యుత్ సరఫరాను పునరుద్ధరించకపోతే ఏడీఏ కార్యాలయం ముట్టడిస్తామని రైతులు మండల పరిధిలోని చేకలగురికి గ్రామంలో సచివాలయం ఎదుట బుధవారం ఆందోళన చేపట్టారు. పది రోజుల క్రితం గాలీవానకు 11 కేవీ విద్యుత్ లైన్ పడిపోవడంతో పొలాలకు విద్యుత్ సరఫరా ఆగిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ అధికారులు పట్టించుకోకపోవడంతో బోర్ల కింద సాగుచేసిన వేరుశనగ, కూరగాయల పంటలు ఎండుముఖం పట్టాయన్నారు. అనంతరం గ్రామ సచివాలయంలో అధికారులకు రైతులు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతులు విజయభాస్కర్, రామాంజనేయులు, చెన్నయ్య, రమేష్, మల్లన్న, ఎర్రిస్వామి, లింగన్న, సిద్ధప్ప, జయరాములు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓగా మైథిలి



శెట్టూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓగా మైథిలి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆమె చెన్నేకొత్తపల్లిలో ఈఓఆర్డీగా విధులు నిర్వహిస్తూ పదోన్నతిలో భాగంగా శెట్టూరు ఎంపీడీఓగా నియమితులయ్యారు. ఇక్కడ ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా పనిచేసిన గంగాదేవి ప్రమోషన్‌పై చెన్నేకొత్తపల్లికి బదిలీ అయ్యారు. అలాగే ఈఓఆర్డీగా రఘురామరాజు బాధ్యతలు తీసుకున్నారు. ఆయన రాయదుర్గం నుంచి బదిలీపై వచ్చారు. వారు విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తామన్నారు.

కట్ట నిర్మాణానికి ఆర్థిక సాయం

కంబదూరు: మండలంలోని పి.వెంకటంపల్లి బస్ షెల్టర్ వద్ద భంభంబాబా ఆలయం ఎదుట ప్రయాణికులు కూర్చోవడానికి వీలుగా కట్ట నిర్మాణానికి విరాళంగా ఉపాధ్యాయుడు బద్దేనాయక్ బుధవారం రూ.37 వేలు గ్రామస్తులకు అందజేశారు. దాతను గ్రామస్తులు అభినందించారు.

నేడు ఆలయ వార్షికోత్సవం

కళ్యాణదుర్గం: స్థానిక మున్సిపల్ కార్యాలయ సమీపంలో ఉన్న లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం అష్టమ వార్షిక మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 10 గంటలకు శ్రీవారికి తులాభారం, 11 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేతుడైన శ్రీవారికి కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. అలాగే శాశ్వత దాతలు తాయి శారదమ్మ, తాయి మల్లయ్య జ్ఞాపకార్థం కుమారుడు తాయి మురళీధర, అనిత కుటుంబ సభ్యులచే స్వామి వారికి పట్టు వస్త్రాల సమర్పించనున్నారు.

పనుల నాణ్యత పరిశీలన

కణేకల్లు: పట్టణంలోని పాత పోలీసుస్టేషన్ వద్ద కొత్తగా రూ.50 లక్షల వ్యయంతో వేసిన సిమెంటు రోడ్డు, పుల్లంపల్లి వద్ద రూ.30లక్షల వ్యయంతో నిర్మించిన కల్వర్ట్ పనులను బుధవారం క్వాలిటీ కంట్రోల్ అధికారులు పరిశీలించారు. డీఈఈ సీహెచ్ శ్రీనివాసులు, జేసీ శ్రీనివాసులు, ఆర్‌అండ్‌బీ డీఈఈ రవిశంకర్‌రెడ్డి పనుల నాణ్యాతను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ జేఈలు సుజిత, నాగేంద్రప్రసాద్, సలీం పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా శివ

రాయదుర్గం టౌన్: అనంతపురం ఉత్తర ప్రాంత ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న రాయదుర్గం పట్టణానికి చెందిన బంగి శివను రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 5, 6 తేదీల్లో విశాఖ పట్నంలో జరిగిన రాష్ట్ర ప్లీనరీ సమావేశాల్లో ఎస్‌ఎఫ్‌ఐ ఆల్ ఇండియా అధ్యక్షుడు వీపీసాను, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ప్రసన్న, అశోక్ ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఎన్నుకున్నారన్నారు. విద్యారంగ సమస్యలపై రాజీ లేని పోరాటం చేస్తానన్నారు.

అతిసారం నివారణపై అవగాహన

విడపనకల్లు: మండలంలోని గడేకల్లు ఆరోగ్య ఉపకేంద్రంలో అతిసారం నివారణ పక్షోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీపీ కరణం పుష్పావతి హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ సాధారణంగా ఐదేళ్లలోపు పిల్లల్లో వచ్చే ప్రమాదకరమైన రోగాలలో అతిసార వ్యాధి ఒకటన్నారు. మల, మూత్రం విసర్జన అనంతరం చేతులు శుభ్రం చేసుకోవాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతి శిశువుకూ సంవత్సరం పాటు తల్లిపాలు ఇవ్వాలన్నారు. అతిసార (డయేరియా) వ్యాధి వస్తే పిల్లలకు వెంటనే ఓఆర్ఎస్ కలిపిన నీటిని, జింక్ మాత్రలను, ఫ్లూయిడ్స్ ఇవ్వాలన్నారు. అనంతరం అతిసారం నివారణ పోస్టర్లను ఆవిష్కరించి, ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సుశీల, ఎంపీటీసీ ఓబులేసు, వైఎస్సార్‌సీపీ నాయకులు కరణం భీమిరెడ్డి, వైద్య సిబ్బంది సుగుణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉమారాణి, మహిళా పోలీసు అరుణకుమారి, అంగన్‌వాడీ టీచర్లు విజయ, నిర్మల, రాజమ్మ, వనతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి


జగనన్న లేఅవుట్‌ను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి

డి హీరేహాళ్ (రాయదుర్గం): డి హీరేహాళ్ మండల వ్యాప్తంగా జగనన్న లే అవుట్లలో చేపట్టిన ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని నియోజకవర్గ ప్రత్యేకాధికారి వరప్రసాద్‌రావు సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని డి హీరేహాళ్‌లో లేఅవుట్‌ను తహసీల్దార్ ఈశ్వర్‌రెడ్డి, డీటీ బసవకుమార్, ఎంపీడీఓ భాస్కర్‌బాబుతో కలసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మంజూరైన ఇళ్లు, నిర్మాణాలు చేపట్టేందుకు ముందుకొచ్చే లబ్ధిదారుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పట్టా పొంది ఇల్లు మంజూరైన వారంతా నిర్మించుకునేలా కృషి చేయాలన్నారు. ప్రతి లబ్ధిదారుడితో మాట్లాడి చైతన్యం తీసుకురావాలన్నారు. పైసా కూడా బిల్లులు పెండింగ్‌లో ఉంచేది లేదని, నిర్మాణాల ఆధారంగా సకాంలో చెల్లించేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించి ఇళ్ల పురోగతిపై దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఆయా శాఖ అధికారులు పాల్గొన్నారు.

బయోమెట్రిక్ హాజరుపై నిర్లక్ష్యం తగదు

శెట్టూరు: సచివాలయ ఉద్యోగులు తప్పనిసరిగా బయోమెట్రిక్ హాజరు నమోదు చేయాలని డీఎల్‌డీఓ శంకర్ సూచించారు. బుధవారం మండలంలోని కైరేవు–2(చెర్లోపల్లి) గ్రామ సచివాలయంలో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. వైఎస్సార్ బీమా ఎన్‌రోల్‌మెంట్ పూర్తి చేయాలని, ఇందులో ఒక్కరు కూడా నష్టపోకుండా చూడాలన్నారు. సిబ్బంది ఏకరూప దుస్తులు ధరించి విధులకు హాజరు కావాలన్నారు. ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందించడంలో నిర్లక్ష్యంగా ఉండకూడదన్నారు. సమయపాలన పాటించాలని, వలంటీర్లకు, సచివాలయ సిబ్బందికి సమన్వయం ఉండాలన్నారు. సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

రాయదుర్గం రూరల్: మండలంలోని మల్లాపురం నరసింహస్వామి స్వాగత తోరణం (ఆర్చ్) వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మాదిగ రాఘవేంద్ర (36) అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మల్లాపురానికి చెందిన రాఘవేంద్ర, చలమేష్ పని ముగించుకుని రాయదుర్గం నుంచి స్వగ్రామానికి ద్విచక్రవాహనంలో బయలుదేరారు. మల్లాపురం స్వాగత తోరణం వద్ద ఎలాంటి సిగ్నల్స్ లేకుండా , రోడ్డుకు అడ్డంగా ఉంచిన ట్రాక్టర్‌ను ఢీ కొట్టడంతో రాఘవేంద్ర అక్కడికక్కడే మృతి చెందగా చలమేష్‌కు తీవ్రగాయాలయ్యాయి. ప్రథమ చికిత్స అనంతరం చలమేష్‌ను బళ్లారి విమ్స్‌కు తరలించారు. మృతుడికి భార్య, ముగ్గురు కమారులున్నారు. మృతుడి భార్య పార్వతి ఫిర్యాదు మేరకు అవులదట్లకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ హరిజన శివకుమార్‌పై కేసు నమోదు చేసి , విచారణ చేపట్టామని హెడ్‌కానిస్టేబుల్ రవీంద్రదేవ్ పటేల్ తెలిపారు.

వృద్ధుడికి గాయాలు

కొంతానపల్లి సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రాతిబావి వంకకు చెందిన కన్నేనాయక్ తీవ్రంగా గాయపడ్డాడు. ఆటో డ్రైవర్ ఆలి ఆటోలో రాతిబావివంక నుంచి ప్రయాణికులతో పాటు వేరుశనగ బస్తాలు వేసుకుని రాయదుర్గం వస్తున్నాడు. కొంతానపల్లి వద్ద స్పీడ్ బ్రేకర్ తప్పించబోయి.. ఆటో రోడ్డు కిందకు దిగి, అదుపు తప్పి బోల్తా పడింది. ఘటనలో కన్నేనాయక్ నడుము భాగాన దెబ్బలు తగలడంతో పాటు ఎడమ చేయి విరిగింది. పలువురికి చిన్నపాటి గాయాలయ్యాయి. ఆయనను హుటాహుటిన రాయదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించగా ప్రథమ చికిత్స చేసిన వైద్యులు అనంతపురానికి రెఫర్ చేశారు. కాగా ఆటో ప్రమాదాన్ని డ్రైవర్ తరపున వకాల్తా పుచ్చుకున్న కొందరు బైక్ ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నాలు చేశారు. ఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

గ్రామాభివృద్ధే లక్ష్యం

కూడేరు: అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ గ్రామాల్లో సమస్యలను పరిష్కరించి, అభివృద్ధే లక్ష్యంగా చేద్దామని తహసీల్దార్ సక్సేనా, ఎంపీడీఓ ముస్తఫా కమల్ బాషా సూచించారు. బుధవారం మండల అధికారులంతా కొర్రకోడు గ్రామంలో పర్యటించారు. తాగునీరు, పారిశుధ్య సమస్య తలెత్తకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. అనంతరం నాడు–నేడు పథకం కింద సుమారు రూ.1.87 కోట్లతో నిర్మిస్తున్న హైస్కూల్ భవన నిర్మాణాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్రశేఖర్, హౌసింగ్ ఏఈ శేఖర్ , ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనారాయణరెడ్డి పాల్గొన్నారు.

కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలి

విడపనకల్లు: కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగారెడ్డి, బాల రంగయ్య పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని పాల్తూరు, కరకముక్కల, హావళిగి, ఉండబండ, చీకలగురికి తదితర గ్రామాల్లో ఈనెల 12న చలో మంగళగిరి పాదయాత్రకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. వారు మాట్లాడుతూ అర్హులైన కౌలు రైతులకు గుర్తింపు కార్డులు రుణాలు, బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం నాయకులు, కౌలే రైతులు పాల్గొన్నారు.

నేడు మండల ఉపాధ్యక్షుడి ఎన్నిక

రాయదుర్గం రూరల్: రాష్ట్ర ఎన్నికల కమీషన్ ఉత్తర్వుల మేరకు రాయదుర్గం మండల పరిషత్ 1వ ఉపాధ్యక్షుడి ఎన్నిక గురువారం నిర్వహించనున్నట్లు ప్రిసైడింగ్ అధికారి రవిశంకర్ రెడ్డి బుధవారం తెలిపారు. గత నవంబర్‌లో వైస్ ఎంపీపీ సత్యనారాయణనాయుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఖాళీ పడిన 1వ వైస్ ఎంపీపీ పదవికి స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆదేశాల మేరకు ఉదయం 10 గంటలకు నిర్వహించే ఎన్నికకు మండల ప్రాదేశిక సభ్యులందరూ తప్పకుండా హాజరు కావాలన్నారు.

108 సిబ్బందికి గాయాలు

బెళుగుప్ప: మండలంలోని రమనేపల్లి– నరసాపురం గ్రామాల మధ్య జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి 108 వాహనాన్ని ట్రాక్టర్ ఢీకొన్న ప్రమాదంలో 108 వాహన సిబ్బందికి తీవ్రగాయాలయ్యాయి. ఓ కేసు విషయమై 108 వాహనం బెళుగుప్ప నుంచి కళ్యాణదుర్గానికి వెళ్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాదంలో వాహనం దెబ్బతినడంతో పాటు సిబ్బంది హరి, సురేష్‌కు తీవ్రగాయాలయ్యాయి. కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్సకు వారిని అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ఉరవకొండ: మండలంలోని పెన్నహోబిళం ఏటి గంగమ్మ ఆలయం సమీపంలో చెట్టుకు ఉరేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అర్బన్ సీఐ హరినాథ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉరవకొండ పట్టణంలోని ఎస్‌ఎల్‌ఎస్ కాలనీ కు చెందిన షేక్ షాను మహ్మద్(45) తాయత్తులు వేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఈ నెల 6న మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లిన మహ్మద్ ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఫోన్ చేసినా స్విచ్ ఆఫ్ వచ్చింది. ఈక్రమంలో పెన్నహోబిళం సమీపంలో ఆయన చెట్టుకు ఉరేసుకుని మృతి చెందినట్లుగా పోలీసులు బుధవారం గుర్తించారు. మహ్మద్ తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో మానసిక వేదనకు గురయ్యేవాడని, ఈ క్రమంలో ఆత్మహత్యకు పాల్పడినట్లు అతడి భార్య నస్రీన్‌బాను పోలీసులకు ఫిర్యాదు చేసింది. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

'జగనన్న విద్యా కానుక' సిద్ధం

- పాఠశాలలు తెరిచిన రోజునే విద్యార్థులకు పంపిణీ
- స్టాక్ పాయింట్ నుంచి పాఠశాలలకు సరఫరా ప్రారంభం


పాఠశాలలకు తరలిస్తున్న విద్యాకానుక కిట్లు

రాయదుర్గంటౌన్: గత టీడీపీ హయాంలో విద్యా సంవత్సరం పూర్తవుతున్నా..ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందే పరిస్థితి ఉండేది కాదు. ప్రస్తుతం అలాంటి పరిస్థితులు లేవు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న పలు సంస్కరణల కారణంగా విద్యా వ్యవస్థ బలోపేతమవుతోంది. పాఠశాలలు ప్రారంభం కాకముందే జగనన్న విద్యా కానుకలు మండల స్టాక్ పాయింట్లలో పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి. పాఠశాలలు తెరిచే మొదటి రోజున కానుకల పంపిణీకి విద్యాశాఖ అధికారులు అన్ని చర్యలు చేపట్టారు. విద్యార్థులకు ఉచితంగా అందజేసేందుకు విద్యా కానుక మెటీరియల్ పట్టణంలోని మోడల్ స్కూల్ స్టాక్ పాయింట్‌లో నిల్వ ఉంచారు. తరగతుల వారీగా పాఠశాలలకు సరఫరా చేసేందుకు విద్యా కానుక కిట్లను వేరు చేసి బుధవారం నుంచి ఎంఈఓ నాగమణి పంపిణీ లాంఛనంగా ప్రారంభించారు. ప్రత్యేకంగా వాహనాన్ని ఏర్పాటు చేసి మండలం, పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలకు సరఫరా చేస్తున్నారు. ప్రభుత్వ చిత్తశుద్ధికి ఇదే ప్రత్యక్ష నిదర్శమని పేరెంట్స్ కమిటీలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

15,023 మందికి విద్యా కానుక లబ్ధి

రాయదుర్గం అర్బన్, రూరల్ పరిధిలోని 81 పాఠశాలల్లో చదివే 15,023 మంది విద్యార్థులకు విద్యా కానుక లబ్ధి చేకూరనుంది. తొమ్మిది రకాల విద్యా కానుకలో భాగంగా ఇప్పటికే ఏడు రకాల మెటీరియల్ స్టాక్ పాయింట్‌లో సిద్ధంగా ఉంచారు. ఇందులో 1 నుంచి 10వ తరగతి వరకు పాఠ్య పుస్తకాలు, వర్క్‌బుక్స్, యూనిఫాం, బెల్ట్, బ్యాగ్‌లు, డిక్షనరీలు సిద్ధంగా ఉన్నాయి. మరో రెండురోజుల్లో మిగతా మెటీరియల్ కూడా సరఫరా కానుంది.

పరిశీలించిన ఎంఈఓ

మోడల్ స్కూల్‌లో నిల్వ ఉంచిన పాఠ్య పుస్తకాలను ఎంఈఓ నాగమణి పరిశీలించారు. బుధవారం స్టాక్ పాయింట్ నుంచి వాహనంలో మండలంలోని పాఠశాలలకు విద్యా కానుక కిట్లను సరఫరాను ప్రారంభించారు. పాఠశాలల ప్రారంభానికి ముందే అర్బన్, రూరల్ పరిధిలోని అన్ని పాఠశాలలకు సరఫరా చేసేందుకు పాఠ్య పుస్తకాలను తరగతుల వారీగా తరలించామన్నారు. పాఠశాలలు తెరిచిన రోజున విద్యా కానుకలను విద్యార్థులకు పంపిణీ చేస్తామన్నారు.